# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

**Bullet Edition**

ఆదివారం, 30 జూన్ 2024 www.prajaaswaramdaily.com 2PM


# తిరుమలలో భక్తుల రద్దీ

## అన్ని కంపార్ట్ మెంట్లు ఫుల్



తిరుపతి, జూన్ 30 (ప్రజాస్వరం): తిరుమలలో భక్తుల కొనసాగుతోంది. శనివారం శ్రీవారిని దర్శనానికి జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ మేరకు టోకెన్లు లేని భక్తులకు దర్శనానికి దాదాపు 18 గంటల సమయం పడుతోంది. వేసవి సెలవులు ముగిసినా భక్తుల రద్దీ ఏమాత్రం తగ్గడం లేదు. ఇక రూ.300 ప్రత్యేక దర్శనానికి సుమారు 3 నుంచి 4 గంటల సమయం పడుతోంది. ఆదివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండి టీబీసీ వరకు భక్తుల క్యూలైన్ కొనసాగుతోంది. శనివారం స్వామివారిని 80,404 మంది భక్తులు దర్శించుకున్నారు. అందులో 35,825 మంది భక్తులు తలనీలాలను సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు వచ్చాయని టీటీడీ అధికారులు వెల్లడించారు.



- ప్రాజెక్టుల్లో నీరు లేదు.. సాగుకు ధైర్యం చాలడం లేదు
- మురిపించి.. మరిచిన రుతుపవనాలు
- ప్రారంభం కాని వర్షాలు
- మరో నెల ఇదే పరిస్థితి అంటున్న వాతావరణ శాఖ
- ఆందోళనలో అన్నదాతలు

# ఎవుసం సాగేదెలా..

హైదరాబాద్, జూన్ 30 (ప్రజాస్వరం): రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. నైరుతి రుతుపవనాలు అనుకున్న సమయానికి ముందే రాష్ట్రాలలోకి ప్రవేశించినప్పటికీ వర్షాలు సమృద్ధిగా పడటం లేదు. జూన్, జులై నెలలో కూడా ఇలాగే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. తుఫానులు వస్తే తప్ప భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు లేవంటున్నారు. ఇది అన్నదాతలకు ఆందోళనకు కలిగించే విషయం.

### ప్రాజెక్టులు ఖాళీ..

ప్రాజెక్టులకు నీరు వచ్చి చేరడం లేదు. సాగు చేద్దామంటే ధైర్యంచాలడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు ఇప్పుడు తలెత్తాయని రెండు తెలుగు రాష్ట్రాలలో రైతులు ఆవేదన చెందుతున్నారు. నిజానికి ఏటా జూన్, జులై నాటికి భారీ వర్షాలు కురిసి జలకళను ప్రాజెక్టులు సంతరించుకుంటాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల కింద సాగయ్యే లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందాలంటే భారీ వర్షాలు పడి ప్రాజెక్టులు నిండాల్సిందే. కొన్నిసార్లు గేట్లు ఎత్తి నీటిని సముద్రంలోకి వదిలేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ ఈ ఏడాది మాత్రం ప్రకృతి కోపించిందనే అనుకోవాలి. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులలో నీరు తగినంతగా లేకపోవడంతో సాగు నీటికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జులై నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. అందుకోసం దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసుకోవాల్సిన సమయంలో నీరులేకపోవడంతో అధికారులు కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నలభై ఏళ్లలో కృష్ణా నదిలో ఇంత తక్కువ నీరు ఎప్పుడూ లేదంటున్నారు. నీరు ఈ ఏడాది అందడం కష్టమేనని చెబుతున్నారు. ఆగస్టు నెల నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ అప్పటికి ఏంజరుగుతుందోనన్న టెన్షన్ రైతుల్లో ఉంది. దుక్కులు దున్ని నాట్లు వేసుకుంటే నష్ట పోతామని ఆందోళన చెందుతున్నారు. అనేక ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో సమయానికి నీరు అందుతుందా? లేదా? అన్న టెన్షన్ మొదలయింది. వరుణుడు కరుణించి భారీ వర్షాలు కురిస్తే తప్ప జలాశయాలు నిండవు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడితేనే కింద ఉన్న జలాశయాలకు నీరు చేరదు. మరి ఈ ఏడాది సాగు పై అనుమానపు మేఘాలు అలుముకున్నాయి.

### కేంద్రం శుభవార్త

కేంద్ర ప్రభుత్వం తన రెండో కేబినెట్ లో రైతులకు ఉపయోగకరమైన నిర్ణయాలను తీసుకుంది. మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ప్రభుత్వం తొలి సంతకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధుల విడుదలపైనే సంతకం చేశారు. ఇరవై వేల కోట్ల రూపాయల నిధులను విడుదల చేశారు. తాజాగా జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలోనూ రైతులకు ఉపయోగకరమైన నిర్ణయాలను తీసుకున్నారు. 14 రకాల పంటలకు... వరి, రాగి, మొక్కజొన్న, పత్తితో సహా పధ్నాలుగు పంటలకు కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచాలని కేబినెట్ భేటీలో నిర్ణయం తసీకున్నారు. దీంతో క్వింటా వరి ధర 2,300 రూపాయలకు చేరింది. పంటల ఉత్పత్తి కన్నా 1.5 రెట్లు కనీస మద్దతు ధరను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. నూనెగింజలు, పప్పు ధాన్యాలకు కూడా మద్దతు ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## నీట్-పీజీ పరీక్ష తిరిగి నిర్వహణ

తిరుపతి, జూన్ 30 (ప్రజాస్వరం): నీట్-పీజీ పరీక్ష ప్రశ్నపత్నం లేకేజీ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తిరిగి నీట్-పీజీ పరీక్షను నిర్వహిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక ప్రకటన చేశారు. అయితే, పరీక్షల నిర్వహణకు సంబంధించి కొత్త షెడ్యూల్ రూపకల్పన మరో రెండు రోజుల్లో ప్రకటించనున్నట్లు తెలిపారు.

## వెంకయ్యనాయుడిపై మూడు పుస్తకాలు

- వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని
- వెంకయ్య ముందు ఎవరూ నిలవలేరు: మోదీ



హైదరాబాద్, జూన్ 30 (ప్రజాస్వరం): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గ్రామీణం ప్రాంతం నుంచి ఉన్నత స్థానానికి ఎదిగారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. వెంకయ్యనాయుడి పుట్టిన రోజు సందర్భంగా ఆయన జీవిత ప్రస్థానంపై రూపొందించిన మూడు పుస్తకాలను వర్చువల్‌గా ప్రధాని విడుదల చేశారు. దీనికి సంబంధించి హైదరాబాద్ గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమం నిర్వహించారు. 'సేవలో వెంకయ్యనాయుడు జీవితం', '13వ ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు లక్ష్యం, సందేశం', 'మహానేత వెంకయ్యనాయుడు జీవితం, ప్రయాణం' అనే పుస్తకాలను మోదీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. వెంకయ్య జీవితంపై పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఇవి దేశ ప్రజలకు మార్గనిర్దేశం చేస్తాయని చెప్పారు. "వెంకయ్యనాయుడితో సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం నాకు దక్కింది. వేలాది కార్యకర్తలు ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నారు. స్వచ్ఛభారత్, అమృత్ యోజన వంటి ఎన్నో పథకాలు సమర్థంగా అమలు చేశారు. ఆయన వాగ్ధాటి ముందు ఎవరూ నిలవలేరు'' అని మోదీ కొనియాడారు.



- అత్యధికంగా కాలిఫోర్నియాలో
- పాపులర్ లాంగ్వేజెస్‌లో తెలుగు
- 350 భాషల్లో 11వ స్థానం
- అమెరికాకు వెళ్లేందుకు తెలుగు రాష్ట్రాల యువత ఆసక్తి
- చదువు, ఉద్యోగాల కోసం అగ్రరాజ్యం బాట

# అమెరికాలో తెలుగువారు 12.30 లక్షలు

వాషింగ్టన్, జూన్ 30, (ప్రజాస్వరం) అమెరికాకు వెళ్లేందుకు తెలుగు రాష్ట్రాల యువత ఆసక్తి చూపిస్తున్నారు. చదువులు, ఉద్యోగాల కోసం వారు అమెరికా వెంట పరుగులు పెడుతున్నారు. ఫలితంగా అమెరికాలో తెలుగు భాషకు ఓ పత్యేకమైన స్థానం ఏర్పడుతోంది. అమెరికా ప్రభుత్వం అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం అమెరికాలో తెలుగు పాపులర్ లాంగ్వేజస్‌లో ఒకటి. ప్రపంచంలోని అన్ని దేశాల వాళ్లు నివసించే అమెరికాలో అత్యధిక మంది మాట్లాడే భాషల్లో తెలుగు ఒకటిగా మారింది. అమెరికాలో పాపులర్ లాంగ్వేజస్‌లో పదకొండో స్థానంలో తెలుగు ఉంది. మొత్తం అమెరికాలో 350 భాషల్ని గుర్తించారు. అమెరికాకు తెలుగు ప్రజల వలస ఎక్కువగా ఉంటోంది.

### యూఎస్ సెన్సెస్ బ్యూరో సర్వే

యూఎస్ సెన్సెస్ బ్యూరో డాటా ప్రకారం ప్రస్తుతం అమెరికాలో 12 లక్షల 30 వేల మంది తెలుగు మాట్లాడే ప్రజలు ఉన్నారు. నిజానికి వీరి సంఖ్య ఏడేళ్ల క్రితం అంటే 2016లో కేవలం 3.2 లక్షలు మాత్రమే. ఏడేళ్లలో ఈ సంఖ్య పన్నెండు లక్షలు దాటిపోయింది. తెలుగు ప్రజలు అత్యధికంగా కాలిఫోర్నియాలో ఉంటున్నారు. ఆ రాష్ట్రంలో రెండు లక్షల మంది తెలుగు మాట్లాడే ప్రజలుంటారు. తర్వాత టెక్సాస్ లో లక్షన్నర మంది, న్యూజెర్సీలో లక్షా పదివేల మంది , ఇలినాయస్ లో 83 వేలు, వర్జీనియాలో 78 వేలు, జార్జియాలో 52 వేల మంది ఉంటున్నారు. ప్రతి ఏడాది పెద్ద ఎత్తున తెలుగు రాష్ట్రాల నుంచి చదువుల కోసం అమెరికా వెళ్తున్నారు. వచ్చిన వారిలో 75 శాతం మంది అక్కడే సెటిల్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. డాలస్ నగరంలో ఎక్కడ చూసినా ఇండియన్స్ ముఖ్యంగా తెలుగువాళ్లే కనిపిస్తారు. అక్కడ ఉంటే సొంత రాష్ట్రంలోనే ఉన్నట్లుగా ఉంటుందని ఎక్కువ మంది అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉంటారు. భారత్ నుంచి వస్తున్న విద్యార్థుల్లో అత్యధిక మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉంటున్నారు. అమెరికాలో తెలుగు సినిమాలకు మార్కెట్ అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పుడు ఓ మంచి సినిమా యాభై కోట్ల వసూలు చేస్తోంది. చదువుకునేందుకు వచ్చే వారు... తమ కంపెనీల తరపున ప్రాజెక్టుల కోసం వచ్చేవారు.. మళ్లీ తిరిగిఇండియాకు వెళ్లాలనుకోవడం లేదు. అక్కడే స్థిరపడిపోతున్నారు. పెద్దఎత్తున ఆస్తులు ఉన్నవారు కూడా.. అమెరికాలో సెటిల్ అవ్వాలని అనుకుంటున్నారు. అందుకే తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు. అయితే ఇటీవలి కాలంలో.. అక్కడ స్థిరపడిన వారు కొంతమంది .. తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారని రిపోర్టులు చెబుతున్నా... వీరి సంఖ్య చాలా స్వల్పం.

## ప్రభుత్వ లాంచనాలతో డీఎస్ అంత్యక్రియలు

### హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజకీయ నాయకులు, ప్రముఖులు

హైదరాబాద్, జూన్ 30 (ప్రజాస్వరం): మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంచనాలతో కాసేపటి క్రితం ప్రారంభమయ్యాయి. నిజామాబాద్‌లోని ఆయన స్వగృహంలో సందర్శనార్థం పార్థీవ దేహాన్ని ఉంచారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా డీఎస్ ఇంటికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో డీఎస్ కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. ఆయన ప్రత్యేక చొరవతోనే 2004లో సోనియా తెలంగాణ ఏర్పాటు ఆమోదించారని అన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీతో డీఎస్‌కు మంచి అనుబంధం ఉందని, బడుగు, బలహీన వర్గాల నేతలను ప్రోత్సాహించారని ప్రశంసించారు. డీఎస్ భౌతికకాయం మీద కాంగ్రెస్ జెండా ఉండాలన్నది ఆయన చివరి కోరిక అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం అంతియ యాత్ర మొదలు కాగా, పలువురు కాంగ్రెస్ నేతలు, చిన్న కుమారుడు ధర్మపురి అరవింద్ తండ్రి పాడెను మోశారు.



డి.శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి